క్లుప్తంగా

మర్యాద పూర్వకంగా..



ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు కొడవలూరి ధనుంజయరెడ్డిని ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ రాజకీ య అంశాలపై చర్చించుకున్నారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, నాయకుల మధ్య విభేదాల పరిష్కారంపై చర్చించుకున్నట్లు సమాచారం. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు జూపల్లి రాజారావు, కాటం రవీంద్రరెడ్డి, కంభం రఘునాథరెడ్డి, పీ మాలకొండారెడ్డి, చేవూరి జనార్దన్‌రెడ్డి, ఇనగలూరి మోహన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఉదయగిరి: మండల తహసీల్దార్ కార్యాలయంలో ఏపీ ఎన్జీఓ ఉదయగిరి తాలూకా టేబుల్ క్యాలెండర్‌ను తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి, ఏపీ ఎన్జీఓ తాలూకా అధ్యక్షుడు బొమ్మతట్టు శ్రీహరి గురువారం ఆవిష్కరించారు. సంఘ నాయకులు రియాజ్, భోగ్యం శ్రీనివాసులు, ఇలియాజ్, సీనియర్, జూనియర్ సహాయకులు సంధాని, లలితమ్మ, ప్రసాద్, అంజాద్, నజీర్, గఫూర్‌బేగ్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఆత్మకూరు: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రాధ్యక్షుడు ఏ రంగనాయకులు కోరారు. పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరుకు మున్సిపల్ కార్మికుల సమస్యలపై పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. వేతనాల నుంచి రికవరీ చేసిన ఈపీఎఫ్ నగదును కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని, ఈపీఎఫ్ పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. శానిటేషన్ కార్మికులకు అవసరమైన పరికరాలు అందజేయాలన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి జీ కిషోర్, ఎం అంకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, హజరత్తయ్య, మునీర్‌బాబు, పెంచలయ్య, చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఏఎస్పీ బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరురూరల్: ఆత్మకూరు సబ్‌డివిజన్ తపాలా శాఖ నూతన ఏఎస్పీగా ముమ్మడి శ్రీధర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఎస్పీని సబ్ డివిజన్ పరిధిలోని మెయిన్ ఓవర్సీస్‌కి సంబంధించిన వై మాల కొండయ్య, సీహెచ్ వెంకయ్య, తదితరులు కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

బట్రకాగోలులో గ్రామసభ



అల్లూరు: మండలంలోని బట్రకాగోలులో సర్పంచ్ చల్లా బుజ్జమ్మ ఆధ్వర్యంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే అభివృద్ధి పనులను వివరించారు. హౌసింగ్ ఏఈ జమీల్, ఈఓపీఆర్డీ వీరేంద్ర, పంచాయతీ కార్యదర్శి చెంచమ్మ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పొగాకు రైతులకు వడ్డీ లేని రుణం



కలిగిరి: మాండూస్ తుపాన్‌తో పొగాకు పంట నష్టపోయిన రైతులకు ప్రోత్సాహకంగా పొగాకు బోర్డు రూ.10వేలు వడ్డీలేని రుణం అందజేస్తోందని కలిగిరి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి ఎం సత్యశ్రీనివాస్ తెలిపారు. కృష్ణారెడ్డిపాళెంలోని పొగాకు రైతులతో గురువారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకుబోర్డు సంక్షేమ నిధిలో సభ్యత్వం ఉన్న రైతులకు రూ.10వేలు వడ్డీ లేని రుణం అందించాలని పొగాకు బోర్డు నిర్ణయించిందన్నారు. రుణం అవసరమైన రైతులు పొగాకుబోర్డులో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రబీ సాగుకు సమాయత్తం

కావలి రూరల్: మండలంలోని తీరంలోని తుమ్మలపెంట, అన్నగారిపాళెం, తాళ్లపాళెం, తదితర పంచాయతీల్లోని రైతులు రబీ సాగుకు సమాయత్తమవుతున్నారు. నిన్నమొన్నటి వరకు తుపాన్ల ప్రభావంతో వర్షాలు కురుస్తూ పొలాల్లో నీరు నిల్వ ఉండడంతో రైతులు రబీ సాగుపై ఆశలు వదులుకున్నారు. గత పదిరోజులుగా ఎండ కాస్తూ పొలాలు ఆరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ వేరుశనగ, పుచ్చ, కూరగాయాలు, ఆకుకూరలు, తదితర పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. ప్రధానంగా వేరుశనగ, పుచ్చ పంటలకు అవసరమైన తేమ శాతం భూమిలో ఉండడంతో వాటి సాగుకు రైతులు దుక్కులు చేసుకుంటున్నారు. జనవరి మాసం వేరుశనగ సాగుకు అదును కావడంతో విస్తారంగా సాగు చేసేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.



వేరుశనగ సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

వేరుశనగ సాగుతో ఆదాయం



గతేడాది నుంచి వేరుశనగ పంట మంచి ధర పలుకుతుండడంతో ఖర్చులు పోగా ఆదాయం వస్తోంది. వర్షాలు పుష్కలంగా పడడంతో దిగుబడులు అధికంగా వస్తున్నాయి. అందుకే ఈ ఏడాది రైతులు వేరుశనగ సాగుపై ఎక్కువ మక్కువ చూపుతున్నారు.

– పానిగల మహేంద్ర, రామచంద్రాపురం

వర్షాలతో దిగుబడులు పెరిగాయి



గతంలో వర్షాలు సక్రమంగా పడక ఉప్పునీటితో చివరి దశలో వేరుశనగ పంట దెబ్బతినేది. గత మూడేళ్లుగా వర్షాలు పుష్కలంగా పడుతుండడంతో భూగర్భ జలాలు పెరిగి పంట దిగుబడులు బాగా వస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు వర్షాలు కురుస్తుండడంతో పంట సాగు కష్టంగా మారింది. ప్రస్తుతం వర్షాలు ఆగిపోయి భూములు ఆరడంతో పంట సాగుకు సిద్ధమవుతున్నాం.

– పొగులూరి రమేష్, వెంకయ్య

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



ప్రకృతి వ్యవసాయ పంట పొలాలను పరిశీలిస్తున్న అధికారులు



ఏఎస్‌పేట: రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ

జలదంకి: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని రాష్ట్ర రైతు సాధికార సంస్థ కోఆర్డినేటర్ కర్నాటి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బ్రాహ్మణక్రాక రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టిసారించి రైతులను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులు, కషాయాలను వినియోగించడం ద్వారా పెట్టుబడులను గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. రసాయన ఎరువుల, మందుల ప్రభావం లేని నాణ్యమైన పంట ఉత్పత్తులు పొందవచ్చని వివరించారు. ప్రకృతి పంటలకు మార్కెట్లో మంచి ధరలు ఉంటాయని తెలిపారు. అనంతరం సేంద్రియ ఎరువులు, కషాయాల తయారీ, వినియోగించే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పంట పొలాలు, పెరటి తోటలను పరిశీలించారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మాలకొండయ్య, వింజమూరు ఏడీఏ రామిరెడ్డి, జలదంకి ఏఓ శైలజ, జెడ్‌బీఎన్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: రైతులు సాగు ఖర్చులు తగ్గించుకోవాలని ఏడీఏ వీ దేవసేనమ్మ సూచించారు. అనుమసముద్రంపేటలో వైఎస్సార్ పొలంబడిని గురువారం నిర్వహించారు. వరిలోని మిత్ర పురుగుల ఉపయోగాలు, వాటి సంరక్షణ, జీవ నియంత్రణ పద్ధతులు, వాటి ఉపయోగాలను రైతులకు వివరించారు. ఆమె వెంట ఏఓ రజని, ఏఈఓ చిరంజీవి, వీఏఏలు ఉన్నారు.

సచివాలయాల్లో 'సదరమ్' స్లాట్‌లు

కావలి: నియోజకవర్గంలోని దివ్యాంగులు సదరమ్ సర్టిఫికెట్ల కోసం సచివాలయాల్లో శుక్రవారం నుంచి స్లాట్లు నమోదు చేసుకోవచ్చని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. సచివాలయాల్లో స్లాట్లు బుక్ చేసుకున్న దివ్యాంగులు కేటాయించిన సమయంలో ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి సదరమ్ సర్టిఫికెట్లు పొందవచ్చని వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొత్త పింఛన్ల పంపిణీ



అల్లూరు: స్థానిక సచివాలయం–1లో కొత్త పింఛన్లను లబ్ధిదారులకు సచివాలయ కన్వీనర్లు బత్తల సుధాకర్, షేక్ జంషీర్ గురువారం పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, సచివాలయ సిబ్బంది మణికంఠ, వలంటీర్లు పాల్గొన్నారు.

పోలీసుల రక్షణ కోరిన ప్రేమజంట



కొండాపురం : ప్రేమించి వివాహం చేసుకున్న ఓ ప్రేమజంట పెద్దల నుంచి రక్షణ కల్పించాలని కొండాపురం పోలీసులను గురువారం ఆశ్రయించింది. వివరాలు..పామూరు మండలం కుంటపల్లికి చెందిన గురవయ్య, వరలక్ష్మి దంపతులు. వారు కుమారుడు గురుబ్రహ్మంతో కలిసి తెలంగాణం రాష్ట్రం ఖమ్మంలో నివాసం ఉంటున్నారు. అక్కడ పీ సంధ్య అనే యువతితో గురుబ్రహ్మానికి పరిచయం ఏర్పడింది. ఇరుఏడాది పాటు ప్రేమించుకున్నారు. కులాంతర వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతో పారిపోయి ఐదు రోజుల క్రితం వివాహం చేసుకున్నారు. కొండాపురంలోని యువకుడి బంధువుల వద్దకు చేరుకుని పోలీసులను ఆశ్రయించారు. ఇరువురు మేజర్లు కావడంతో యువతి తల్లిదండ్రులకు ఫోన్ చేసి తెలియజేశామని ఎస్సై ఖాజావలి తెలిపారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

ఆత్మకూరు: పట్టణంలోని ఎస్సార్‌జేడీ కళాశాల మైదానంలో జరుగుతున్న వీఎస్‌యూ అంతర్ కళాశాలల జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండోరోజైన గురువారం నిర్వహించిన సెమీఫైనల్స్‌లో తొలుత జరిగిన మ్యాచ్‌లో బుచ్చి సెంట్‌మేరీస్ కళాశాల జట్టుపై ఆత్మకూరు ఏఎస్సార్ డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. రెండో మ్యాచ్‌లో ఆత్మకూరు షిర్డీ సాయిరాం కళాశాల జట్టుపై ఎస్సార్‌జేడీ కళాశాల జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. కాగా శుక్రవారం ఫైనల్ పోటీ నిర్వహించనున్నట్లు పీడీ వెంకటేశ్వర్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ వరకుమారి, వర్సిటీ స్పోర్ట్స్ అబ్జర్వర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఆర్గనైజర్ టీ శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సెమీఫైనల్ మ్యాచ్‌కు ముందు టాస్ వేస్తున్న కెప్టెన్లు

భూముల కొనుగోలుదారుల గగ్గోలు

సీతారామపురం: మండల కేంద్రమైన సీతారామపురంలోని సర్వే నంబర్1లోని 438 ఎకరాల మేత పొరంబోకు భూముల్లో 47 ఎకరాలు ఆక్రమణకు గురైన విషయం తెలిసిందే. ఈ భూముల కొనుగోలుదారులు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని ఆవేదన వ్యక్తం చేశారు. మేత పొరంబోకు భూములు స్వాహాపై పంచాయతీలో అలజడి రేగడం, తహసీల్దార్ కార్యాలయంలోని కంప్యూటర్ సీపీయూ మాయం కావడంతో కొనుగోలుదారుల్లో అయోమయం నెలకొంది. ఈ క్రమంలో తమకు న్యాయం చేయాలని కొనుగోలుదారులు తహసీల్దార్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్నారు. బెంగళూరు–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే మంజూరవుతుందని, ఇతర ప్రదేశాల నుంచి వచ్చి ఎకరాకు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు వెచ్చించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నామని, కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తమకు పాస్‌పుస్తకాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ డబ్బులు తమకు తిరిగి ఇవ్వాలంటూ అమ్మకందారులపై ఒత్తిడి తెస్తున్నారు. కాగా సీతారామపురంలోని మేతపొరంబోకు భూముల అమ్మకాలు, కొనుగోలు విషయంలో గతం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన తహసీల్దార్, పంచాయతీకి చెందిన కొందరి నేతల ప్రమేయం ఉన్నట్లుగా ప్రచారం జోరుగా సాగుతోంది. జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపితే మేత పొరంబోకు ఎవరెవరి పేర్లతో ఎన్నిసార్లు రిజిష్టర్ అయ్యాయనే విషయాలు బయటపడతాయని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

నేటి నుంచి గ్రామసభలు

అనుమసముద్రంపేట: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు ఎం సుభద్ర గురువారం తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు, అసైన్‌మెంట్ భూముల పంపిణీపై చర్చించనున్నట్లు చెప్పారు. 6న ఏఎస్‌పేట బిట్–1,2, 7న అనుమసముద్రం, చిరమన, 9న శ్రీకొలను, గుడిపాడు, 10న గుంపర్లపాడు, కావలియడవల్లి, 11న కొండమీదకొండూరు, పెద్దబ్బీపురం, 12న రాజవోలు, జమ్మవరం, 13న చౌటభీమవరం సచివాలయాల పరిధిలో గ్రామసభలు జరుగుతాయని వివరించారు.

రేపు ఘంటసాల నాటకం

కావలి: పట్టణంలోని కారోనేషన్ రీడింగ్ రూంలో ఈ నెల 7న సాయంత్రం 7 గంటలకు ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు, స్వర్గీయ ఘంటసాల జీవితానికి సంబంధించిన నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఘంటసాల వెంకటేశ్వరరావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన సాయి సంతోషి నాట్యమండలి ఆధ్వర్యంలో 30 మంది సురభి కళాకారులు ఘంటసాల జీవితంలోని వివిధ కోణాలను ప్రదర్శించనున్నట్లు వివరించారు. ఘంటసాల అభిమానులు, సంగీత, సాహిత్య, నాటక అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించాలని కోరారు.

రేపు ఇస్కాన్ రథయాత్ర

కావలి: ఇస్కాన్ ఆధ్వర్యంలో పట్టణంలో కృష్ణ–బలరామ్ రథయాత్రను శనివారం వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు బృందావనం కాలనీలోని కల్యాణ మండపం నుంచి రథయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఆర్టీసీ బస్టాండ్, ఐదు లాంతర్ల సెంటర్, పాతవూరు కృష్ణుడి గుడి సెంటర్, శివాలయం మీదుగా పీహెచ్‌ఆర్‌ఆర్ కల్యాణ మండపం వద్ద రథయాత్ర ముగుస్తుందన్నారు. రథయాత్రలో భజనలు, కోలాటాలు, కీర్తనలు, రంగవల్లులు నిర్వహించనున్నట్లు వివరించారు.

8న విశ్వబ్రాహ్మణ సర్వసభ్య సమావేశం

ఉదయగిరి: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఈ నెల 8న విశ్వబ్రాహ్మణ సంఘ నియోజకవర్గ స్థాయి సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంఘ మండలాధ్యక్షుడు అగర సుబ్రహ్మణ్యాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత ఎస్ శాంతికుమారి, విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు ఆలూరి తిరుపాలు, కార్యదర్శి పేట విజయాచారి, రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షురాలు భీమవరపు నీరజ, తదితరులు హాజరవుతారని చెప్పారు. ఉదయగిరి నియోజకవర్గంలోని విశ్వబ్రాహ్మణ సోదరులు హాజరుకావాలని కోరారు.

భూసమస్యలను పరిష్కరించాలి

ఉదయగిరి: భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సిబ్బంది చొరవ చూపాలని తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలన్నారు. భూముల రీసర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. అగ్రిమెంట్లు, మ్యుటేషన్లు, తదితర సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ ఫాజిహా, సీనియర్ అసిస్టెంట్ సంధాని, తదితరులు పాల్గొన్నారు.

11న ఎమ్మార్పీఎస్ జాతీయ మహాసభ

కలిగిరి: ఈ నెల 11న బెంగుళూరులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్, అనుబంధ సంఘాల జాతీయ మహాసభలను నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్‌మాదిగ తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ కార్యకర్తలతో సమావేశాన్ని గురువారం ఆయన నిర్వహించారు. జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు జీ వెంకటేశ్వర్లు, పీ అంబేడ్కర్, జీ కొండలరావు, కొండయ్య, అనంద్, ఇర్మియ, మాల్యాద్రి, వెంగళరావు, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవచూపాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

సంగం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి చొరవచూపాలని ఎంపీపీ కంటాబత్తిన పద్మావతమ్మ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతి సచివాలయానికి రూ.20లక్షలు మంజూరు చేస్తోందని తెలిపారు. ఈ నిధులతో సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని సూచించారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సహకారంతో గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. వెంగారెడ్డిపాళెం సర్పంచ్ ఆనంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అవసరమైన మేర ఎరువులను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచాలని సూచిస్తున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా అందజేయాలని కోరారు. ఏఓ శ్రీహరి స్పందిస్తూ జిల్లా అధికారుల ఆదేశాలతో యూరియాను కేంద్రాల వారీగా పంపిణీ చేస్తున్నామని, ఏమైనా లోటుపాట్లు ఉంటే జిల్లా అధికారులకు తెలియజేస్తామన్నారు. హౌసింగ్ ఏఈ కరీముల్లా మాట్లాడుతూ తరుణవాయి పంచాయతీ పరిధిలో పక్కాగృహాల నిర్మాణాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. సంగంతో పాటు మిగిలిన పంచాయతీల్లోని జగనన్న కాలనీల్లో నుడా అనుమతులు వచ్చిన వెంటనే నిర్మాణాలు ప్రారంభించేందుకు కాంట్రాక్టర్లతో సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం రెవెన్యూ, విద్యా, వైద్యం, ఐకేపీ, ట్రాన్స్‌కో తదితర శాఖల అధికారులు మాట్లాడారు. జెడ్పీటీసీ రావుల లక్ష్మి, వైస్‌ఎంపీపీ తలపల ఇందిర, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కంటాబత్తిన రఘునాథరెడ్డి, ఎంపీడీఓ గోపి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతరకు విస్తృత ఏర్పాట్లు

కావలి: రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉన్న అల్లూరు పోలేరమ్మ జాతరను ఈ నెల 10వ తేదీన అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి స్వయంగా ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ఏటా సంక్రాంతికి ముందు అల్లూరులో నిర్వహించే పోలేరమ్మ గ్రామోత్సవానికి ప్రత్యేక విశిష్టత ఉంది. పోలేరమ్మ జాతరకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా దేశవిదేశాల్లో స్థిరపడిన అల్లూరు వాసులు అమ్మవారి దర్శనం కోసం తరలివస్తారు. గ్రామోత్సవం రోజున అల్లూరు రోడ్లు ఇసుక వేస్తే రాలనంతగా జనంతో నిండిపోతాయి. ఏటా అమ్మవారి జాతరకు వచ్చే భక్తుల సంఖ్య భారీగా పెరుగుతుండడంతో అందకనుగుణంగా ఈ దఫా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల రద్దీకి తగిన విధంగా వసతులు కల్పించడమే కాకుండా అమ్మవారి విశిష్టతకు, ప్రాశస్త్యానికి తగిన విధంగా గ్రామోత్సవం జరిగే వారం రోజుల ముందు నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని సుందరంగా అలంకరించడంతో పాటు అమ్మవారికి ప్రీతికరమైన పుష్పయాగాన్ని నేత్రపర్వంగా చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి.

గ్రామోత్సవం సాగేది ఇలా..

పోలేరమ్మ గ్రామోత్సవంలో 10వ తేదీ ఉదయం స్వర్ణాభరణాలతో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం 6.30 గంటలకు గ్రామపూజ, 7 గంటల నుంచి నిరంతర దర్శనం, 7.30 గంటలకు చద్ది సమర్పణ, 8 గంటలకు పోతురాజు వద్ద అమ్మవారి చద్ది నివేదన, మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు సంప్రదాయ పద్ధతిలో పోలేరమ్మ కథా కార్యక్రమం, సాయంత్రం 4.30 గంటలకు పోతురాజు వద్ద అమ్మవారి చద్ది, పానకాల నివేదన , 5గంటలకు అమ్మవారి కుంభ కార్యక్రమం, రాత్రి 7 గంటలకు కలుగోళమ్మకు పల్లకీసేవ, 7.30 గంటల నుంచి పోలేరమ్మ ముద్రగడ పావన కార్యక్రమం, రాత్రి 8 గంటలకు పురాతన సంప్రదాయానికి కొనసాగింపుగా గంగపెట్టె, వీరతాళ్లు, కత్తి ఆచార కార్యక్రమం నిర్వహించనున్నారు.

టీడీపీ నాయకులపై డీఎస్పీకి ఫిర్యాదు



డీఎస్పీకి టీడీపీ నాయకులపై ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కావలి: పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన అధికారులను బహిరంగంగా దూషించడంతో పాటు వారి విధులకు ఆటంకం కల్పిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్న టీడీపీ నాయకులపై వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్, డీఎస్పీ వెంకటరమణకు గురువారం ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకులు బీద రవిచంద్రయాదవ్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాలెపాటి సుబ్బానాయుడు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ కిషోర్, మన్నవ రవిచంద్ర, తదితరులు గత నెల 29న కావలిలో టీడీపీ నిర్వహించిన రోడ్‌షోలో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన అధికారులను బహిరంగంగా తీవ్రస్థాయిలో దూషించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్డీఓ, డీఎస్పీ స్థాయి అధికారులను కులం పేరుతో, వ్యక్తిగతంగా కించపరిచేలా వాఖ్యలు చేశారని ఆరోపించారు. బృందావనం కాలనీలోని మున్సిపల్ కమిషనర్ నివాసానికి టీడీపీ నాయకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ కిషోర్, గొట్టిపాటి రాము, మంచాల ప్రసాద్, ఉప్పుటూరి బాలగురుస్వామి, మన్నవ రవిచంద్ర వెళ్లి రౌడీయిజం చేయడంతో పాటు సభ్యసమాజం తలదించుకునేలా అసభ్యకరంగా మాట్లాడారని గుర్తుచేశారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారని తెలిపారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు రోడ్‌షో సందర్భంగా ప్రజలను ఆకర్షించేందుకు బోగోలు మండలం కడనూతలకు చెందిన ఎస్సీ యువకుడు పైడి హర్షను పురుగుల మందు తాగేలా ప్రోత్సహించి, అతని ప్రాణాలతో చెలగాటమాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. టీడీపీ నాయకులు పథకం ప్రకారం వివాదాలు సృష్టించేలా, అధికారుల మనోస్థైర్యం దెబ్బతినేలా నిత్యం ప్రెస్‌మీట్లు, సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ, అనుచిత వాఖ్యలు చేస్తూ వివాదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. పోలీసు అధికారులు సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు గంధం ప్రసన్నాంజనేయులు, కుందుర్తి కామయ్య, పరుసు మాల్యాద్రి, తాళ్లపాళెం సర్పంచ్ కటికాయల సురేష్, ఎంపీటీసీ సభ్యులు శ్రీను, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డిప్యూటీ డీఈఓ హరిప్రసాద్

ఆత్మకూరు: పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకుని విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధం చేయాలని కావలి డిప్యూటీ డీఈఓ ఎం హరిప్రసాద్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఆత్మకూరు, సంగం ఎంఈఓలు ఎస్‌కే నజీర్, జానకిరామ్‌తో కలిసి పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు బోధన తీరును ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిప్యూటీ డీఈఓ మాట్లాడుతూ నిర్దేశించిన మేరకు సిలబస్‌ను పూర్తి చేసి పునఃశ్చరణ చేయాలన్నారు. విద్యార్థులను మార్కుల ఆధారంగా మూడు గ్రేడ్‌లుగా విభజించి, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను 8వ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం నాడు–నేడు పనుల పురోగతిని పరిశీలించారు. తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ల మధ్యన విభేదాలు నెలకొని గత కొద్ది రోజులుగా నాడు–నేడు పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. వైస్‌చైర్మన్ సిమెంట్‌ను ఇవ్వకపోవడంతో గురువారం పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో డిప్యూటీ డీఈఓ ఇరువర్గాలను పిలిపించి మాట్లాడారు. జిల్లా విద్యా శాఖ అధికారికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

జీఓ రద్దు చేయాలని టీడీపీ ఆందోళన

ఆత్మకూరు: ఇటీవల ప్రతిపక్ష నేత చంద్రబాబు సభల్లో తొక్కిసలాటలు చోటు చేసుకుని పలువురు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 1ను రద్దు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా కుప్పంలో చంద్రబాబును పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ మున్సిపల్ బస్టాండ్ వద్ద గురువారం ప్రదర్శన చేపట్టబోయారు. కొందరు నాయకులు జీఓ నంబరు 1 జెరాక్స్ ప్రతుల దహనానికి యత్నించారు. ఎస్సై ఎం శివశంకర్‌రావు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి నిరసన ప్రదర్శనలు చేపట్టరాదని వారిని అడ్డుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. టీడీపీ నాయకులకు సంఘీభావం వ్యక్తం చేస్తూ పలువురు సీపీఎం నాయకులు పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం సొంత పూచీకత్తుపై టీడీపీ నాయకులను పోలీసులు విడుదల చేశారు.

ఆహార ఉత్పత్తుల తయారీపై శిక్షణ



చేజర్ల: స్థానిక వైకేపీ కార్యాలయంలో ఆహారఉత్పత్తుల తయారీపై గురువారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీఎంఎఫ్‌ఎం పథకం కింద ఆహార ఉత్పత్తుల యూనిట్లను పొందిన 36 మంది లబ్ధిదారులకు ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో రిసోర్స్‌పర్సన్ మధు సూదన్‌రావు ఆహార ఉత్పత్తుల తయారీ విధానంపై అవగాహన కల్పించారు. మార్కెట్ సౌకర్యం, నూతన ఉత్పత్తుల తయారీ, తదతర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఏపీఎం సుజన మాట్లాడుతూ లబ్ధిదారులు ఆహార ఉత్పత్తుల తయారీలో మెళకువలను అందిపుచ్చు కుని స్వయం ఉపాధి పొందాలన్నారు. ఏసీ వెంకటేశ్వర్లు, సీసీ భాస్కర్, పుల్లయ్య, సుమతి, ప్రసాద్ పాల్గొన్నారు.